

వెబ్‌సైట్‌లో సీనియార్టీ జాబితా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా పలు మున్సిపాలిటీల్లో ఉన్న మున్సిపల్ యాజమాన్యపు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు ఉద్యోగోన్నతి పొందడానికి విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులను అనుసరించి సీనియారిటీ జాబితా వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలో అభ్యంతరాలు ఉంటే నవంబరు ఒకటో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా జిల్లా విద్యాశాఖాధికారికి తెలియజేయాలని సూచించారు.

పడకేసిన 'మడ్డువలస'

- కాలువ తవ్వకాలకు మైనింగ్ అనుమతుల పెండింగ్
- స్ట్రక్చర్ల నిర్మాణాలకు ముందుకు రాని నిర్మాణ సంస్థ
- కొత్తగా చేపట్టిన తర్వాత ఐదు శాతమే పూర్తి
- ప్రాజెక్టు పూర్తిపై కొరవడిన స్పష్టత

ప్రతి ఎకరాకు నీళ్లిస్తాం... జిల్లాను సస్యశ్యామలం చేస్తామంటూ మాటలు చెప్తున్న పాలకులు, పనుల దగ్గరకొచ్చేసరికి మాత్రం ఆ రకమైన చిత్తశుద్ధి కనబరచడం లేదు. జిల్లాలో పలు సాగునీటి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నా, వాటిని పట్టించుకున్న పరిస్థితి కనబడడం లేదు. మడ్డువలస రెండో దశ పనులే ఇందుకు ఉదాహరణ. ప్రాజెక్టు పూర్తయితే సుమారు 25 వేల ఎకరాల వరకు సాగు నీరందించే అవకాశం ఉన్నా, ప్రాజెక్టు పూర్తిపై దృష్టిసారించడం లేదు. మడ్డువలస ప్రాజెక్టుకు సంబంధించి పొందూరు మండలంలో పలు ప్రాంతాల్లో బండరాళ్ల తొలగింపునకు మైనింగ్ శాఖ నుంచి అనుమతులు ఇవ్వకపోవడం, సేకరించిన భూములకు రైతులకు డబ్బులు చెల్లించకపోవడం వంటి కారణాలతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఒప్పంద కాలపరిమితి జనవరి వరకు ఉన్నా ఇప్పటివరకు సాగిన పనులు పరిశీలిస్తే, అప్పట్లోగా పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



లావేరు మండలం కొత్తకొంకాం వద్ద తవ్వి వదిలేసిన కాలువలు

మడ్డువలస జలాశయ రెండో దశ పథకాన్ని నిర్మించాలని 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 6, 2009లో రూ.57.87 కోట్లకు పరిపాలనా ఆమోదం కూడా తెలిపింది. జి.సిగడాం, పొందూరు, లావేరు, ఎచ్చెర్ల, మండలాల్లోని 24,954 ఎకరాలకు సాగునీందించాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. దీంతో మొత్తం 21 గ్రామాలకు తాగునీరు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. పథకం నిర్మాణ బాధ్యతలను విశాఖపట్నానికి చెందిన పి.జె.ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ టెండర్లలో రూ.47.3933 కోట్లకు దక్కించుకుంది. మార్చి 2, 2009న ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం పనిని 24 నెలల కాలంలో పూర్తి చేయాల్సి ఉంది. అంటే మార్చి 2, 2011 నాటికే పనులు పూర్తయి రైతులకు సాగు నీరందించాల్సి ఉంది. ఒప్పంద కాలపరిమితులు పొడిగిస్తూ ప్రభుత్వం వరుసగా ఆరు పర్యాయాలు అవకాశం ఇచ్చింది. చివరిసారిగా కాలపరిమితిని జూన్ 30, 2018 వరకు పొడిగించింది. అధికారిక లెక్కల ప్రకారం 78.36 శాతం పనులు పూర్తయ్యాయి. మరో 21.64 శాతం పనులు మిగిలి ఉన్నాయి. ఒప్పందం విలువ రూ.47.393 కోట్లలో 37.14 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం సంబంధిత నిర్మాణ సంస్థ పనులు నిలుపుదల చేసింది. దీంతో ప్రభుత్వం జూలై 8, 2020లో సంబంధిత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని ముగించింది.

కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగింత

రిజర్వాయర్ పనులు చేపట్టిన పిజెఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఇప్పటివరకు 78.36 శాతం మేర పనులు పూర్తి చేసి వైదొలగింది. మిగిలిన 21.64 శాతం పనులు చేసేందుకు కొత్త నిర్మాణ సంస్థకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు మిగిలిన పనులకు కొత్త రేట్లకు అనుగుణంగా అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం వాటికి ఆమోదం తెలిపి రూ.26.90 కోట్లను మంజూరు చేస్తూ 2022 ఏప్రిల్ 25వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. స్టేజ్-2లో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన బిఎన్‌బి ఇన్‌ఫ్రా ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ రూ.23.83 కోట్లతో టెండర్లను దక్కించుకుంది.

అడుగడుగునా అవాంతరాలే...

మడ్డువలస పనులను 2009లో ప్రారంభించి 2020 జూలై వరకు 78.36 శాతం జరిగాయి. రెండో దశ పూర్తి కావాలంటే మరో 21.64 శాతం పనులు పూర్తి చేయాలి. మిగిలిన పనులను ప్రభుత్వం కొత్త నిర్మాణ సంస్థకు అప్పగించింది. మడ్డువలస పున: ప్రారంభ పనులకు అప్పటి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం శంకుస్థాపన చేశారు. అప్పట్నుంచీ మొదలైన పనులు మందకొడిగానే సాగుతున్నాయి. ఇది చాలదన్నట్లు పనులకు రకరకాల ఆటంకాలు ఏర్పడుతున్నాయి. పొందూరు మండలం వి.ఆర్ గూడెం, ధర్మపురం, వావిలపల్లిపేట, ప్రాంతాల్లో కాలువ తవ్వకాలకు బండరాళ్లు అడ్డురావడంతో వాటిని పేల్చి తొలగించాల్సి ఉంది. మైనింగ్ శాఖకు దరఖాస్తు చేసినా ఇంకా అనుమతులు ఇవ్వలేదు. రైతుల నుంచి తీసుకున్న భూములకు రూ.2.25 కోట్లను చెల్లించకపోవడంతో కాలువ తవ్వకాలు ఆగిపోయాయి.

ప్రాజెక్టు పూర్తిపై స్పష్టత కరువు

మడ్డువలస పనులు చేస్తున్న సంబంధిత కాంట్రాక్టరు నిరాసక్తత కనబరుస్తున్నట్లు తెలిసింది. బిల్లులు వస్తాయో, లేదోనన్న సందేహంతో వెనకడుగు వేస్తుండడంతో పనులు ముందుకు సాగడం లేదు. పది కిలోమీటర్ల మేర కాలువ తవ్వాల్సి ఉండగా, నాలుగు కిలోమీటర్లు తవ్వారు. కాలువపై 250 స్ట్రక్చర్లు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు ఒక్కటీ నిర్మించలేదు. కొత్తగా పనులు మొదలైన తర్వాత ఐదు శాతం మాత్రమే పూర్తయ్యాయి. కొత్త ఒప్పందం ప్రకారం వచ్చే ఏడాది జనవరిలోగా పనులు పూర్తి కావాల్సి ఉంది. పనులు చేపడుతున్న పరిస్థితి చూస్తే ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.



స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్, ఎస్‌పి, జెసి, ఎమ్మెల్యే

సిఎం సభాస్థలి పరిశీలన

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి

నవంబరు ఒకటో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో సభాస్థలి కోసం అధికారులు అన్వేషిస్తున్నారు. ఇందులో భాగంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి మండలాల్లో సోమవారం పర్యటించారు. ఇచ్ఛాపురం మండలంలోని ఈదుపురం, సోంపేట మండలంలోని కొర్లాం పంచాయతీ పరిధిలోని బాలకృష్ణ జూనియర్ కళాశాల సమీపంలో, బారువ రైల్వేగేటు వద్ద, పాలవలస జాతీయ రహదారి కూడలి వద్ద, కంచిలి మండలం పద్మతులం వద్ద స్థలాలను పరిశీలించారు. వీటిలో హెలీప్యాడ్, పార్కింగ్‌తో పాటు సభకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయనున్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారి జిల్లాకు చంద్రబాబు వస్తున్నారు. దీపావళి సందర్భంగా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేసే కార్యక్రమాన్ని ఆయన జిల్లా నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నారు. సూపర్ సిక్స్ హామీల అమల్లో భాగంగా రెండో హామీని జిల్లా నుంచే ప్రారంభించనుండడంతో దీన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏ గ్రామం అనుకూలంగా ఉంటుందనే విషయమై అధికారులంతా ఆయా గ్రామాల్లో కలియతిరిగారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, ఆయా మండలాల తహశీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చెకుముకి విజేతలకు బహుమతులు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో బాగంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులను ప్రదానం చేశారు. ప్రభుత్వ పాఠశాలల విభాగం నుంచి జలుమూరు మండలం కరవంజ మోడల్ స్కూల్ విద్యార్థులు రావాడ హేమ శిరీష, ఆర్.ఎర్రన్నాయుడు, టి.ధరణి ప్రథమ స్థానాన్ని దక్కించుకోగా, ప్రైవేట్ పాఠశాలల విభాగం నుంచి రణస్థలం మండలం శ్రీ నారాయణ స్కూల్, కోస్ట విద్యార్థులు ఎస్.రాజ్ కుమార్, ఎం.పల్లవి, ఎస్.మనోహర్‌కు ప్రథమ స్థానం దక్కింది. వీరు నవంబర్ 9, 10 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కామేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ తెలిపారు. ప్రభుత్వ విభాగం నుంచి పాతపట్నం మండలం రొంపివలస జెడ్‌పిహెచ్‌ఎస్ ద్వితీయ స్థానం, లావేరు మండలం తామాడ మోడల్ స్కూల్ తృతీయ స్థానం దక్కించుకున్నాయి. ప్రైవేట్ విభాగం నుంచి ఆమదాలవలస మండలం ఎస్.వి.ఎస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు ద్వితీయ స్థానం దక్కించుకుంది. కన్సొలేషన్ బహుమతిని ఇచ్ఛాపురం మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్, సారవకోట మండలం బుడితి జెడ్‌పిహెచ్‌ఎస్, కవిటి మండలం జిహెచ్‌ఎస్, హిరమండలం మండలం గులుమూరు జెడ్‌పిహెచ్‌ఎస్ దక్కించుకున్నట్లు తెలిపారు. వారికి ప్రశంసా పత్రాలు, మెమొంటోలను అందజేశారు. జిల్లాస్థాయిలో పాల్గొన్న 216 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు.



చెకుముకి సంబరాల్లో విజేతలు



రక్తదాతలతో కలెక్టర్, ఎస్‌పి, జెసి

రక్తదాతలే ప్రాణదాతలు

- పోలీస్ సిబ్బంది ఆరోగ్యంపై దృష్టిసారించాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పోలీస్ సిబ్బంది చేసిన రక్తదానం అత్యవసర పరిస్థితుల్లో వేరే వ్యక్తి ప్రాణాలు కాపాడడానికి ఉపయోగపడుతుందని, రక్తదాతలే ప్రాణదాతలు అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల స్మారక ఉత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరం, రిమ్స్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన సోమవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి కలెక్టర్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించగా, ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్‌పి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ సిబ్బందితో పాటు యువత, విద్యార్థులు, ప్రజలు ఇలాంటి కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నిరంతరాయంగా ప్రజల కోసం పనిచేస్తున్న పోలీసులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. అమరవీరుల స్మారక ఉత్సవాలు ఈనెల 31వ తేదీ వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఎస్‌పి తెలిపారు. టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో ఈనెల 29, 30 తేదీల్లో వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. స్మారక ఉత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు సైబర్ నేరాలు, యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. రక్తదానం చేసిన పోలీస్ సిబ్బందికి ధ్రువీకరణ పత్రాలతో పాటు, రెడ్‌క్రాస్ పతకాన్ని కలెక్టర్, ఎస్‌పి, జెసి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, ఎల్.శేషాద్రి, సిఐలు అవతారం, ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, సూర్యనారాయణ, రెడ్‌క్రాస్ చైర్మన్ బి.జగన్నాథం ప్రతినిధులు చైతన్య కుమార్, మెడికవర్ హాస్పిటల్ వైద్యులు, జిజిహెచ్ వైద్యాధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం

- పరిష్కరించకుంటే పోరాటాలను ఉధృతం చేస్తాం
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు
- మున్సిపల్ కార్యాలయాల వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనిసిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్.బలరాం, ఉపాధ్యక్షులు ఎ.గణేష్ విమర్శించారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయాల వద్ద సోమవారం ధర్నాలు చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి వారు మాట్లాడారు. చట్టబద్ధమైన సెలవులు, వారాంతపు సెలవులు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు పూర్తిస్థాయిలో పనిముట్లు, రక్షణ పరికరాలు ఇవ్వాలన్నారు. డెత్, సిక్ పోస్టుల్లో వారి వారసులకు ఉద్యోగాలివ్వాలన్నారు. సాధారణ ప్రమాద మరణాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు వెంటనే చేయాలన్నారు. కార్మికులు చనిపోతే దహన సంస్కారాలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పెంచాలని, నాలుగు రకాల ఇపిఎఫ్ ఖాతాలను ఒకే ఖాతా కిందకు జమ చేయాలని కోరారు. ఇఎస్‌ఐ అమలుతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. కోవిడ్, బదిలీ, ఎన్.ఎం.ఆర్ కార్మికులను ఆప్కాస్ చేర్పించి వారికి సరైన వేతనాలు చెల్లించాలని కోరారు. రిటైర్మెంట్, తరువాత రావాల్సిన బకాయిలతో పాటు చనిపోయిన వారికి క్లయిమ్‌లు వెంటనే చెల్లించాలన్నారు. ఇంజినీరింగ్ సెక్షన్, టౌన్ ప్లానింగ్, పార్కుల్లో పనిచేస్తున్న కార్మికులు 5 నుంచి 40 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్నారని, వారికి టిఎ, డిఎలు చెల్లించాలన్నారు. 60 ఏళ్లు నిండిన వారికి బలవంతంగా రిటైర్మెంట్ చేయిస్తున్నారని, అనారోగ్య కారణాలతో కొందరిని తొలగిస్తున్నారని వారి స్థానంలో వారసులకు అవకాశాలు ఇచ్చి ఉపాధి కల్పించాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు అధికారుల రికమెండేషన్ రద్దు చేయాలని, క్లాప్ డ్రైవర్లకు చట్టబద్ధంగా జీతాలు చెల్లించాలన్నారు. జిఒ నంబరు 36ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను నివారించి వారికి రక్షణ కల్పించాలన్నారు. విజయవాడ వరద ముంపు సమయంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లో పాల్గొన్న కార్మికులందరికీ నెల జీతం బోనస్‌గా చెల్లించాలన్నారు. యూనిఫారాలకు క్లాత్ ఇచ్చి కుట్టు చార్జీలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవ్‌లు, జిపిఎఫ్ అకౌంట్లు, డిఎ బకాయిల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్పొరేషన్ విస్తీర్ణ పరిధికి అనుగుణంగా పారిశుధ్య సిబ్బందిని పెంచాలన్నారు. ధర్నా అనంతరం కమిషనర్ పి.వి.వి.డి ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎ.జ్యోతిప్రసాద్, రాఘవ, ఇంజినీరింగ్ కార్మికులు పి.మణికంఠ, గిరిజాశంకర్, క్లాప్ డ్రైవర్లు నారాయణ, రామకృష్ణ, జె.మాధవి, ఎ.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.గణపతి, కె.వెంకట్, బి.కూర్మారావు, డి.శ్రీనివాస్, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సిహెచ్.మురగన్, ఎం.రవి, ఎస్.రమేష్, శకుంతల, పి.సీతమ్మ పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఇచ్ఛాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ఆందోళన చేపట్టారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ అప్పలస్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమేష్ కుమార్ పట్నాయక్, ఫెడరేషన్ నాయకులు శంకరరావు, కేశవ బెహరా, బి.లిమ్మయ్, తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు



ఇచ్ఛాపురం : వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు



పలాస : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

త్వరితగతిన అర్జీలను పరిష్కరించాలి

- డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు
- 'మీకోసం'లో 142 వినతులు

శ్రీకాకుళం అర్బన్ : త్వరిగతిన అర్జీలను పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. జెడ్‌పిలో సోమవారం మీకోసం నిర్వహించిన కార్యక్రమంలో 142 వినతులను స్వీకరించారు. పొందూరు మండలం పిల్లలవలసలో భూగర్భజలాలు కలుషితం కావడంతో కిడ్నీ వ్యాధులు విజృంభించడంతో ప్రజలు రోగగ్రస్తులవుతున్నారని చెన్నకేశవరావు, ఈశ్వరరావు రాంబాబులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 14 మంది వరకు మృతి చెందారని వివరించారు. మృతుల్లో ఎక్కువ మంది 50 ఏళ్ల లోపు వారేనని అన్నారు. ప్రస్తుతం 20 మంది కిడ్నీ బ్యాధితో బాధపడుతున్నారని, ఐదురుగు డయాలసిస్ దశలో ఉన్నారని తెలిపారు. గ్రామాన్ని కిడ్నీ మహమ్మారి నుంచి కాపాడేందుకు తక్షణమే ఆర్‌ఒ ప్లాంటును నెలకొల్పాలని కోరారు. మెళియాపుట్టి మండలం సిరియాకండి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్న బోకర పార్వతిని రాజకీయ కారణాలతో అర్ధాంతరంగా తొలగించారని ఆమె భర్త చిన్నవాడు ఫిర్యాదు అందజేశాడు. మాకన్నపురం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తి పనిలో లేని వారి పేరుతో మస్టర్లు వేసి పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజు,ఉప కలెక్టర్ అప్పారావు పాల్గొన్నారు.

15 మందికి కారుణ్య నియామకాలు

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ వివిధ కారణాలతో మృతి చెందిన 15 మంది ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టారు. ఆర్‌టిసిలో ఏడుగురికి, సచివాలయాల్లో పనిచేస్తూ... మృతి చెందిన 8 మంది కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలు డిఆర్‌ఒ అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి.మీనాక్షి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ కళ్యాణ్ బాబు, డ్వామా పీడీ సుధాకర్, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వర ప్రసాద్, విద్యుత్‌శాఖ ఎస్ఇ కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువు

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - పలాస

రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని శాసనసభ మాజీ స్పీకర్, వైసిపి శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు తమ్మినేని సీతారాం విమర్శించారు. కాశీబుగ్గలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టిడిపి నాయకులు రెచ్చిపోయి వైసిపి నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. ఆ దాడులు చివరకు మహిళలు, బాలికల వరకూ వెళ్లాయని విమర్శించారు. పలాసలో ఇద్దరు బాలికలపై అత్యాచారం ఘటనలో నిందితులపై సంబంధం లేని సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం సిగ్గుచేటు అన్నారు. నిందితులపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల కిందట ఇద్దరు వైసిపి కార్యకర్తలపై టిడిపి కార్యకర్త దాడి చేస్తే, తిరిగి వైసిపి వాళ్లపై కేసులు నమోదు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులకు వైసిపి వారే లక్ష్యమైతే, నాయకులు, కార్యకర్తలు అందరిపై కేసులు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతలు గాడి తప్పుతున్నాయని, జిల్లా ఎస్‌పి చేతకాని పోలీస్ బాస్ అని వ్యాఖ్యానించారు. ప్రజలకు రక్షణ ఇవ్వకుండా, టిడిపి నేతలకు ఆశ్రయమిస్తున్న పోలీస్‌స్టేషన్లకు తెలుగుదేశం పార్టీ బోర్డులు పెట్టి, కార్యాలయాలకు పసుపు రంగు వేస్తామన్నారు. ప్రజల రక్షణ కోసం చట్టసభల్లో చేసిన చట్టాలు సరదా కోసమా అని ప్రశ్నించారు. దాడికి గురైన వైసిపి కార్యకర్తల పరామర్శకు వెళ్తామంటే రెండు రోజులుగా నిర్బంధించడం దారుణమన్నారు. పదవుల కోసం సిఎం చంద్రబాబు, లోకేష్ మెప్పు పొందేందుకు ఎమ్మెల్యే శిరీష తాపత్రయపడుతున్నారని చెప్పారు. ప్రజలు అధికారం ఇచ్చిన ఐదు నెలల కాలంలోనే నంద్యాల, బద్వేల్, తెనాలి, హిందూపురం సరసన పలాసను చేర్చారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో దిశ యాప్, జిల్లాకో మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే, వాటిని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక తప్పుదోవ పట్టించేందుకే నాలుగు డైవర్షన్ వార్తలు సృష్టించిన ఘనత చంద్రబాబుదని ఎద్దేవా చేశారు. ఐదు నెలల్లోనే ప్రభుత్వం ప్రజా విశ్వాసం కోల్పోయిందన్నారు. సమావేశంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, పైల వెంకటరావు, ఎంపిపిలు డొక్కరి దానయ్య, ఉంగ సాయికృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ బోర బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



వైసిపి నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

రెండో రోజూ అప్పలరాజు గృహ నిర్బంధం

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును కాశీబుగ్గ పోలీసులు రెండో రోజు సోమవారం కూడా గృహ నిర్బంధం చేశారు. మాజీ స్పీకర్ సీతారాం, ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి ఆయన దాడికి గురైన మన్మథరావు, వెంకటరమణను పరామర్శించేందుకు వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో వారు వాగ్వివాదానికి దిగారు. చివరకు ఎస్‌పి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు పోలీసు బందోబస్తు నడుమ సీతారాం వాహనంలో సీదిరి అప్పలరాజు, నర్తు రామారావు కలిసి దాడికి గురైన వారిని పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

డిఆర్‌ఒ బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్: జిల్లా రెవెన్యూ అధికారిగా మారెళ్ళ వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆయనకు సూచించారు. వెంకటేశ్వరరావు గతంలో జిల్లాలో పలాస, ఇచ్ఛాపురం, పోలాకి మండలాల్లో పలు హోదాల్లో పనిచేశారు. 2014-19 మధ్య టెక్కలి ఆర్‌డిఒగా పనిచేసి, బదిలీపై రంపచోడవరంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ కలెక్టర్‌గా వెళ్లారు. డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందాక ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్‌గా, కెఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా జిల్లాలో పనిచేశారు. డిఆర్‌ఒగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కలెక్టరేట్ ఎఒ సూర్యనారాయణ, సి, జి సెక్షన్ల సూపరింటెండెంట్లు రాజేశ్వరరావు, జి.ఎల్.వి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు


అభినందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- కవిటి

కర్నూలులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఎస్‌విజె విద్యాసంస్థల్లో 9వ తరగతి చదువుతున్న ఎస్.తిరుపతి సిల్వర్ మెడల్ సాధించి సత్తా చాటాడు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ సోమవారం తన క్యాంపు కార్యాలయంలో తిరుపతిని అభినందించారు. భవిష్యత్‌లో మరింత ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అంతకుముందు పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ బెందాళం కింగ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు విద్యార్థిని సత్కరించారు. కార్యక్రమంలో బెందాళం రమేష్, ప్రగడ మణిబాబు, బెందాళం సురేష్, బదకల ఎర్రయ్య, ఎస్‌విజె హెచ్‌ఎం బి.జగ్గారావు, ఎం.భాస్కరరావు పాల్గొన్నారు.

కళాశాలను సందర్శించనున్న నాక్ బృందం

ప్రజాశక్తి- ఆమదాలవలస


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నవంబర్ నెలలో నాక్ బృందం సందర్శించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్.ఎన్ ఎస్ ఎన్ స్వామి తెలిపారు. సోమవారం కళాశాలలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆమదాలవలసలో డిగ్రీ కళాశాల ఏర్పడిన తర్వాత 2016లో నాక్ బృందం పరిశీలించి బి గ్రేడ్‌గా గుర్తించిందని, ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి నాక్ బృందం డిగ్రీ కళాశాలను పరిశీలించి అభివృద్ధి గ్రేడింగ్ ఇచ్చి కళాశాల అభివృద్ధికి ఎంతో దోహద పడుతుందన్నారు. కళాశాలలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కొరతతో పాటు కొంతమేర సమస్యలు కూడా ఉన్నాయని, వాటిని అధిగమించడానికి అందరి సహకారంతో ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నాక్ బృందం పరిశీలనలో ఏడు విషయాలను పరిగణలోకి తీసుకొని గ్రేడింగ్‌ను ఇవ్వడం జరుగుతుందన్నారు. రెండవసారి జరుగుతున్న నాక్ బృంద పర్యటన ఎంతో ఆనందంగా ఉందని, ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధించడానికి కృషి చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల క్రీడా పోటీలు సోమవారం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించడం ద్వారా మంచి భవిష్యత్ లభిస్తుందన్నారు. కళాశాల వేదికగా పుట్‌బాల్, హాకీ క్రీడలకు పోటీలు నిర్వహించారు. విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల నుంచి ఔత్సాహికులైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డిఎస్‌డిఒ ఎ.జగన్మోహనరావు, యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఎం.శ్రీనివాసరావు, కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌ఛార్జి బి.మోహనరావు, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ హరిత, పీడీ జ్యోతి కుమార్ పాల్గొన్నారు.



రణస్థలం రూరల్ : విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని కోష్ట జంక్షన్‌లో ఉన్న శ్రీ నారాయణ హైస్కూల్ విద్యార్థులు ఆదివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి సంబరాల్లో అద్భుత ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా వ్యాప్తంగా 225 మంది విద్యార్థులు పోటీపడగా జిల్లాస్థాయిలో అత్యుత్తమ మార్కులతో శ్రీ నారాయణ హైస్కూల్ విద్యార్థులు రాజ్ కుమార్, పల్లవి, మనోహర్‌లు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి గైడ్ టీచరుగా కె.గోపి వ్యవహరించారు. వీరిని పాఠశాల డైరెక్టర్ కెల్ల మంజు భార్గవి, కరస్పాండెంట్ కె.గోవింద, ప్రిన్సిపాల్ గౌరు నాయుడు, పలువురు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పాతపట్నం : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్షలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రొంపివలస విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని సాధించారు. జిల్లాస్థాయిలో 75 టీమ్‌లు పాల్గొన్న ఈ ప్రతిభా పరీక్షలో విద్యార్థులు డి.మనోహర్, పి.ధనుష్, ఆర్.అభినయ్ టీం ద్వితీయ స్థానాన్ని సాధించారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది సోమవారం పాఠశాలలో అభినందనలు తెలియజేశారు.


పరామర్శిస్తున్న సీతారాం, తిలక్

మాజీ స్పీకర్ పరామర్శ

కోటబొమ్మాళి: ప్రజాస్వామ్యంలో అమానవీయ సంఘటనలకు ఊతమివ్వటం సరికాదని, అది రాజకీయ లక్షణం కాదని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కిష్టుపురానికి చెందిన దళిత మహిళ సల్ల దమయంతి, ఆమె భర్త అప్పలరాజుపై అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణ టిడిపి కార్యకర్తలు ఆదివారం వాళ్ల ఇంటికి వెళ్లి దాడి చేయడంతో గాయపడ్డారు. వీరు కోటబొమ్మాళి ప్రభుతాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వైసిపి శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు, మాజీ స్పీకర్ సీతారాం, టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత కుటుంబంపై ఇంటికి వెళ్లి దాడి చేయడం హేయమైన చర్యని అన్నారు. దీనిపై ఎస్‌పి కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి, నందిగాం ఎంపిపిలు రోణంకి ఉమామల్లేశ్వరరావు, నడుపూరు శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, హేమసుందర రాజు, దుక్క రామకృష్ణ, బోయిన నాగేశ్వరరావు, కాళ్ల సంజీవరావు, బొడ్డు వెంకటరమణ, పేరాడ వెంకటరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానానికి తూట్లు

- అడ్డగోలుగా తరలిపోతున్న ఇసుక లారీలు
- స్పందించని రెవెన్యూ, పోలీస్, గనుల శాఖాధికారులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

కూటమి ప్రభుత్వం ప్రజల కోసం తీసుకువచ్చిన ఉచిత ఇసుక విధానానికి కొంతమంది ఇసుక అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ప్రజలకు, భవన నిర్మాణ కార్మికులకు మేలు చేయాలన్న ఉద్దేశంతో ఉచిత ఇసుక పథకాన్ని సరళతరం చేయడంతో కొంతమంది వంశధార నదీ పరివాహక ప్రాంతంలోని ఇసుక వ్యాపారులకు కాసులు కురిపిస్తున్నాయని పలు గ్రామాల ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని చెవ్వాకుల పేట, రావాడపేట, చిట్టివలస, సంగమేశ్వర స్వామి కొండ, పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఉన్న డాబా వెనుక ప్రాంతాలు ఇసుక రవాణాకు అడ్డాగా మారాయని, పగటిపూట ప్రశాంతంగా గ్రామాల రహదారులు ఉంటున్నాయని, చీకటి పడితే ట్రాక్టర్లు, జెసిబిలు విపరీతమైన శబ్దాలు చేస్తూ వరుస క్రమంలో వెళ్తూ గ్రామ శివారులో ఉన్న తోటలు, కొండలను స్థావరాలుగా చేసుకొని ఇసుకను డంపు చేస్తూ అక్కడి నుంచి లారీలకు లోడ్ చేస్తూ వేల రూపాయలకు కొంతమంది ఇసుకా సురులు అమ్ముకుంటున్నారని పలు గ్రామాల ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ వ్యాపారం చేస్తున్న వ్యక్తులపై పోలీస్, రెవెన్యూ, గనుల శాఖాధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని పలువురు పేర్కొంటున్నారు. కొంతమంది అధికారులకు నగదుతో పాటు వారానికి రెండుసార్లు మాంసం, మద్యం, పలు రకాల పళ్ల వంటి తాయిలాలను ఇసుకాసురులు సమకూర్చుతూ ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తూ జేబులు నింపు కుంటున్నారని చిట్టివలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చెప్పడం విశేషం. ప్రభుత్వం ప్రజల కోసం ఉచిత ఇసుక పథకాన్ని తీసుకువస్తే గ్రామాల్లో మొన్నటి వరకు ఉప్పు, నిప్పుగా ఉన్న టిడిపి వైసిపి నాయకులు ఒక్కటై ఇసుక అక్రమ దందా చేస్తూ కాసులు కూడ బెట్టుకుంటున్నారన్న విమర్శలు వినిపి స్తున్నాయి. మునుముందు ఇలాగే ఇసుక అక్రమ వ్యాపారం కొనసాగితే ప్రభుత్వానికి చెడ్డపేరు తప్పదని పలువురు వ్యాఖ్యాని స్తున్నారు. 12 టైర్ల లారీకి 7 నుంచి 9 ట్రాక్టర్ల ఇసుక పడుతుందని, ఒక ట్రాక్టర్ ఇసుక రూ.వెయ్యికి కొనుగోలు చేసి లారీ ఇసుకను రూ.15వేల నుంచి రూ.20 వేల మధ్య విక్రయించి ఇసుకాసురులు సొమ్ము చేసుకుంటున్నారన్న పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

జిల్లా నుంచి ఇసుక లారీలు చీకటి పడగానే అడ్డగోలుగా తరలి పోతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారుల తీరుపై పలువురు మండి పడుతున్నారు. జిల్లా సరిహద్దు పైడి భీమవరం వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినప్పటికీ ఎటువంటి పత్రాలు లేకుండా అక్రమ ఇసుక లారీలు ఎలా తరలి వెళ ్నాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో మూలకు చేరిన ట్రాక్టర్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉచిత ఇసుక విధానం ప్రకటించిన నాటి నుంచి హడావుడి చేస్తున్నాయని పలువురు చర్చించు కుంటున్నారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించినప్పటికీ అది సద్వినియోగం కంటే దుర్వినియోగం ఎక్కువ అవుతుందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు కలిసి సమిష్టిగా ప్రభుత్వ నిబంధనలను అమలు చేసి ఇసుకాసురుల భరతం పట్టాలని పలువురు కోరుతున్నారు.


పాలిటెక్నిక్ కళాశాల వద్ద డాబా వెనుక ఇసుక నిల్వలు


జగనన్న కాలనీ సమీపంలో ఉన్న అక్రమ ఇసుక నిల్వలు

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి- జలుమూరు

రెవెన్యూ సదస్సుల ద్వారానే భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే రమణమూర్తి అన్నారు. మండలంలోని గుండువలసలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో భూములు రీ సర్వే జరిగిన గ్రామాల్లో తప్పుగా నమోదైన వాటిని సరిచేసేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని అన్నారు. గతంలో భూములు రీ సర్వే సమయంలో భూముల విస్తీర్ణం పరంగా తేడాలు ఉంటే వాటికి సంబంధించిన వాటిని సరైన ఆధారాలతో దరఖాస్తు చేసుకున్న వాటికీ పరిష్కారమవుతాయని అన్నారు. రీ సర్వేలో తప్పుగా నమోదైన పేర్లను కూడా సరిచేస్తారన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని కరవంజలో నిర్వహించిన టిడిపి సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని 21వ వార్డు పరిధిలోని రావికంటి పేటలో నిర్వహించిన రీసర్వే రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తమ భూములు వివరాలను సరిచూసుకుని తప్పులు ఉంటే దరఖాస్తుల ద్వారా సరి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాంబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీతా సాగర్, టిడిపి నాయకులు సనపల ఢిల్లీశ్వరరావు, అన్నెపు భాస్కరరావు, బోర గోవిందరావు, కింజరాపు శివ, పొన్నాడ రామారావు, తమ్మినేని విద్యాసాగర్, రెవిన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లావేరు : రీసర్వేలో సమస్యల సవరణకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు, భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎన్ని జోగారావు అన్నారు. సోమవారం మండలంలోని గోవిందపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూములకు సంబంధించి పలు సమస్యలపై 33 వినతులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డిటి ఎన్.తిరుపతిరావు, మండల సర్వేయర్ బి.శ్రీధర్ రెడ్డి, ఆర్ఐ ఆర్.అప్పలరాజు, సర్పంచ్ పిల్లా రాము, టిడిపి నాయకులు ఇజ్జు బాబూరావు, చిక్కాల ఎల్లన్న దొర, అచ్చుతరావు, ఆర్.తాతారావు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


మెళియాపుట్టి : రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ బడ్డే పాపారావు సూచించారు. మండలంలోని సజ్జనాపురం, నాయుడుపోలూరు గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా 30కి పైగా దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్ గౌడ్, సర్పంచ్‌ల ప్రతినిధులు పెద్దింటి శ్రీనివాసరావు, బి.కూర్మారావు, మాజీ సర్పంచ్ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి


అభినందిస్తున్న హెచ్‌ఎం శోభారాణి

జాతీయ క్రీడలకు ఏకాక్షరి ఎంపిక

టెక్కలి : టెక్కలి బాలికోన్నత పాఠశాలకు చెందిన గేదెల ఏకాక్షరి అనే విద్యార్థిని జాతీయ క్రీడలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు ఎం.శోభారాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమెను అభినందించారు. ఇటీవల కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పరుగు పందెంలో పాల్గొని జాతీయ క్రీడలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఇందుకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.


పనులను పరిశీలిస్తున్న రవిబాబు

సిసి రోడ్ల పనులు పరిశీలన

ప్రజాశక్తి- పలాస

సిసి రోడ్లు నిర్మాణంలో నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపివేస్తామని పలాస పంచాయతీ రాజ్ డిప్యూటీ ఇంజినీర్ గొర్రెల రవిబాబు కాంట్రాక్టర్లకు హెచ్చరించారు. మండలంలోని పాత జగదేవపురం, కిష్టుపురం గ్రామాల్లో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్ల పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనలు అనుగుణంగా సిసి రోడ్లు నిర్మాణం చేపట్టాలన్నారు. సిసి రోడ్లు నిర్మాణం అనంతరం వాటరింగ్ చేయాలని సూచించారు. ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని కపాసుకుద్దిలో డ్రైనేజీ సమస్యతో వ్యాధులు ప్రబలుతున్నాయని, అధికారులు స్పందించి పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన మీకోసంలో తహశీల్దార్ మురళీమోహన్‌కు కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పారిశుధ్యం పేరుకు పోతోందన్నారు. దీంతో వ్యాధులు విజృంభించి ప్రజలు రోగాల బారిన పడుతున్నట్లు తెలిపారు. ఎన్ని వైద్య శిబిరాలు నిర్వహించినా గ్రామంలో పరిశుభ్రత లేకపోతే వ్యర్థమని, దాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బడే గురుమూర్తి, బడే లోహిదాస్ తదితరులు పాల్గొన్నారు.

తొగరాం అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

రూ.139 లక్షలతో తొగరాం గ్రామ అభివృద్ధికి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం మండలంలోని తొగరాంలో రూ.139.50 లక్షలు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామంలోని సిసి రోడ్లకు, కాలువల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొగరాం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. గతంలో నియోజకవర్గాన్ని పరిపాలించిన తమ్మినేని సాధించింది ఏమీలేదని ఎద్దేవా చేశారు. కలివరం పంచాయతీలో 46 పింఛన్లను తొలగించిన ఘనత మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకే దక్కిందన్నారు. నాగావళి నది నుంచి తొందరలోనే తాగునీటిని ప్రజలకు అందిస్తానని, నాలుగైదు నెలల్లో అన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు కూటమి ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఇసకలపేట గ్రామానికి గతంలో తాను రహదారి కోసం నిధులు మంజూరు చేశానని గడిచిన ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని మరిచి దోపిడీకి తెరతీసిందన్నారు. మాజీ స్పీకర్ తమ్మినేని నియోజకవర్గ అభివృద్ధి కంటే తన అభివృద్ధి కోసమే ఎక్కువగా పాటు పడ్డారన్నారు. రానున్న నాలుగు నెలల్లో కొత్తవలస నుంచి బూర్జ మండలంలోని కొల్లివలస వరకు రెండు వరసల రహదారిని నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఇసుక మాఫియా అని పదే పదే తమ్మినేని మాట్లాడుతున్నాడని, తాను ఎక్కడైనా ఎవరి దగ్గరైనా ఒక రూపాయి తీసుకున్నానని నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. గతంలో తాను ముద్దాడ పేట వద్ద బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తే మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అదే బ్రిడ్జిని బలసలరేవు బ్రిడ్జికి ఆ నిధులను తరలించారన్నారు. తాను ఆయన లాంటి పనులు చేయలేనని ముద్దాడ పేట బ్రిడ్జికి నిధులు మంజూరు చేయించి బలసల రేవు బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా పూర్తి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సుజాత, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, అమర్నాథ్, విద్యాసాగర్, నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, అన్నెపు భాస్కరరావు, బోర గోవిందరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

దీపావళి కానుకగా విద్యుత్ ఛార్జీల మోత


పాతపట్నం : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి


ప్రజాశక్తి- కవిటి

సంపద సృష్టించి ప్రజలకు పంచి పెడతానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు, ప్రజల కాయ కష్టం దోచుకునేందుకు సన్నద్ధమయ్యారని ఎమ్మెల్సీ నర్తు రామారావు ఒక ప్రకటనలో ఆరోపించారు. సామాన్య ప్రజలకు దీపావళి కానుకగా విద్యుత్ ఛార్జీలను పెంచుతూ టిడిపి కూటమి ప్రభుత్వం మరిచిపోలేని బహుమతి ఇచ్చిందని ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఆకాశాన్ని తాకిన నిత్యవసరాల ధరలతో సతమతమవుతున్న ప్రజలపై విద్యుత్ ఛార్జీల రూపంలో పిడుగు పడిందని అన్నారు. ఓవైపు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ అంటూనే... మరోవైపు రాష్ట్ర ప్రజలపై రూ.6,070 కోట్ల విద్యుత్ వినియోగ భారాన్ని మోపుతూ షాక్‌కు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలను పెంచబోమంటూ, ఎన్నో ప్రకటనలను గుప్పించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చినా నాలుగు నెలల్లోనే తన నిజస్వరూపాన్ని చూపించారని విమర్శించారు.

పోలీస్‌స్టేషన్ ముట్టడిస్తాం

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును గృహ నిర్బంధించడాన్ని రామారావు తీవ్రంగా ఖండించారు. పక్కా ప్రణాళికతో వైసిపి కార్యకర్తలను వేధిస్తున్నారని అన్నారు. ఆదివారం పలాసలో జరిగిన సంఘటన తీవ్ర భయాందోళనలను రేకెత్తించిందని అన్నారు. సాక్షాత్తు పోలీస్ స్టేషన్‌లోనే, పోలీసుల సమక్షంలోనే పిడుగుద్దులను గుద్దుతూ వైసిపి నాయకులపై దౌర్జన్యం చేసిన సంఘటన సోషల్ మీడియా ద్వారా బహిర్గతమైందని అన్నారు. దాడులకు పాల్పడిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేయాలని, లేనిపక్షంలో జిల్లా నాయకత్వంతో కలిసి పోలీస్‌స్టేషన్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

పాతపట్నం : విద్యుత్ ఛార్జీల మోత దీపావళికి కూటమి ప్రభుత్వం ఇచ్చే కానుక ఇదేనా? అని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ ఛార్జీలు 30 శాతం తగ్గిస్తామని ఎన్నికల ముందు హామీనిచ్చారని, ఇప్పుడు ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. అక్రమంగా ఇసుక దోపిడీ, ప్రయివేటు మద్యం షాపుల ద్వారా గ్రామాల్లో మద్యం ఏరులైపారుతుందన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని విమర్శించారు. ఈమెతో పాటు వైసిపి నాయకులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివాజీ

అప్పలరాజు సెటిల్మెంట్ కింగ్

మాజీ మంత్రి గౌతు శివాజీ

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గంలో సెటిల్మెంట్ కింగ్ మాజీ మంత్రి అప్పలరాజేనని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల బాలికలపై జరిగిన అఘాయిత్యాలపై అప్పలరాజు అనుచిత వ్యాఖ్యలు ఎమ్మెల్యే, తన కుమార్తె శిరీషపై చేశారని అన్నారు. తాము ఏనాడు సెటిల్మెంట్లకు ప్రోత్సహించ లేదన్నారు. 30 ఏళ్ల గౌతు రాజకీయ జీవితంలో ఇటువంటి వివాదాలకు దారిలేదన్నారు. నువ్వలరేవుకు చెందిన మువ్వల నగేష్ విద్యార్థి అనుమానస్పద మృతిపై అప్పట్లో మంత్రిగా అప్పలరాజు చేసిన రాయకీయం, సెటిల్మెంట్లు ప్రజలకు తెలిసిందేనని వ్యాఖ్యానించారు. కొర్ల విష్ణు వ్యవహారం ఉద్దేశపూర్వకంగా వైసిపి నాయకులు చేసినట్లు కనిపిస్తోందన్నారు. ఇద్దరు వ్యక్తులు కొట్లాట తరువాత భారీ సంఖ్యలో వైసిపి నాయకులు పోలీస్టేషన్‌కు చేరుకోవడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. పలాస నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే శిరీష ముందంజలో ఉన్నారని అన్నారు. వంశధార నీరు తీసుకొచ్చి రైతుల్లో ఆనందాన్ని నింపారని పేర్కొన్నారు. ప్రతి చేనుకు నీరు - ప్రతి చేతికి పని అనే సంకల్పంతో అభివృద్ధికి బాటలు వేశారన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఎక్కడా లేని విధంగా రూ.50 కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చిన ఘనత ఆమెకు దక్కిందన్నారు. అప్పలరాజు హయాంలో చేసిన పనులకు శంకుస్థాపన చేసారే తప్ప ఒక్క పెద్దపని పూర్తి చేశారా? అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే శిరీషపై ఫేక్ ఐడిలు పెట్టి సోషల్ మీడియలో పోస్టింగులు పెడుతున్నారని, దీనిపై తాను డిఎస్‌పికి నేరుగా ఫిర్యాదు చేస్తానని తెలిపారు. సమావేశంలో ఎపిటిడిసి చైర్మన్ వజ బాబూరావు. పేరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్ గుప్త, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, మల్లా శ్రీనివాస్, దొక్కరి శంకర్, దడియాల నర్సింహులు, తమ్మినేని గంగారాం, కుత్తుమ లక్ష్మణ్, మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

పాముకాటుతో వృద్ధుడు మృతి


లోకనాథం (ఫైల్)

సోంపేట : మండలంలోని జింకిభద్రకు చెందిన తాళ్ల లోకనాథం (62) పాముకాటుతో మృతి చెందారు. ఆదివారం సాయంత్రం పొలానికి వెళ్లాడు. అక్కడ పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం టెక్కలి, అక్కడి నుంచి జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందారు.

నెల్లూరులో జిల్లావాసి మృతి

ప్రజాశక్తి- నౌపడ

పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా చెముడుగుంట సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సంతబొమ్మాళి మండలం నౌపడకు చెందిన గిన్ని కృష్ణారావు(48) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. కృష్ణారావు గత కొంతకాలంగా నెల్లూరులో ఓ రైస్ మిల్లులో పని చేస్తున్నారు. పనికి వెళ్లే క్రమంలో మిల్లు వద్ద రహదారి దాటుతుండగా గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం మృతదేహాన్ని సోమవారం రాత్రి స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కృష్ణారావు నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి అని, మృతుడు కుటుంబానికి న్యాయం చేయలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యక్తికి గాయాలు

పలాస : మండలంలోని గరుడఖండి పాత జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన రమణకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు పలాస నుంచి శ్రీకాకుళం వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న 108 వాహనం సిబ్బంది సత్యం, వెంకటరావు ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పలువురిపై కేసు నమోదు

కోటబొమ్మాళి: మండలంలోని విశ్వనాథపురం పంచాయతీ గొల్లపేటకు చెందిన వంజరాపు లక్ష్మణరావు ఇచ్చిన పిర్యాదు మేరకు అంగూరు హరికృష్ణతో పాటు మరో ఐదుగురుపైనా, అదే గ్రామానికి చెందిన అంగూరు హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వంజరాపు లక్ష్మణరావుతో పాటు మరో నలుగురుపైనా కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ సోమ వారం తెలిపారు. ఇటీవల కొద్ది రోజుల క్రితం హరికృష్ణ ఇంట్లో పోయిన బంగారం లక్ష్మణరావు భార్య తవిటమ్మ దొంగలించిందని అనుమానంతో వీరి మధ్య విబేధం చోటుచేసుకొని ఆదివారం కొట్లాటకు దారి తీసిందన్నారు. ఇరు గ్రూపుల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించామని తెలిపారు. అలాగే మండలంలోని కిష్టుపురానికి చెందిన చల్ల శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన చల్ల అప్పలరాజుపై, అలాగే చల్ల అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చల్ల శ్రీనుతో పాటు మరో ఏడుగు రుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ధర్మాన శ్రీనుకు చెందిన కారుపై చల్ల అప్పలరాజు మూత్ర విసర్జన చేశాడని విషయంపై తగదాపడి కోట్లాడు కున్నారని, గాయపడ్డ ఇరు వర్గాలకు స్థానిక ప్రభు త్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేశామని తెలిపారు.


ఇసుక లారీని సీజ్ చేసిన అధికారులు

ఇసుక నిల్వలపై దాడులు

సరుబుజ్జిలి: మండలంలోని పాలవలస, పెద్దపాలెం గ్రామాల మధ్య ఉన్న సాయినగర్ రియల్ ఎస్టేట్ ప్రాంతంలో ఉన్న ఇసుక నిల్వలపై సోమవారం అధికారులు దాడులు నిర్వహించారు. తహశీల్దార్ ఎల్ మధుసూదన్, ఎస్ఐ టి.రాజేష్, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్న ఈ దాడుల్లో అక్రమంగా భారీగా నిల్వ చేసిన ఇసుక పోగులను గుర్తించారు. వాటి వివరాలను సేకరించడానికి అధికారులు ప్రయత్నించినప్పటికీ స్థానికులు ఎవరు నోరు మెదపక పోవడంతో అధికారులు మూడు ఇసుక పోగులను, ఇసుక లోడుతో ఉన్న లారీని సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ తెలిపారు. అక్రమ రవాణా చేస్తున్న లారీ డ్రైవర్ పరారీ కావడంతో ఇసుక పోగులను, లారీలను గనుల శాఖాధికారులకు అప్పగించడం జరుగు తుందని, తదుపరి చర్యలు ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.

అనుమతులు తప్పనిసరి

పోలాకి: దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ పి.రంజిత్ తెలిపారు. ఈ మేరకు అనుమతి పొందిన షాపు ఏర్పాట్ల స్థలాలు సోమవారం పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయించాలన్నారు. షాపుకి షాపుకి 10 అడుగుల దూరం ఉండాలన్నారు. మండలానికి ఆరు షాపులు అనుమతులు వచ్చాయని తెలిపారు..

ఎరువుల షాపు తనిఖీ

పోలాకి: ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు ఇవ్వాలని ఎడిఎ రవీంద్ర భారతి ఆదేశించారు. పోలాకిలోని ఎరువుల షాపులను తనిఖీ చేశారు. ఎరువుల బస్తాల తూకం, వాటి పరిమాణం కచ్చితంగా ఉందా? లేదా? పరిశీలించారు. అమ్మిన ప్రతి వస్తువుకీ బిల్లులు తప్పనిసరిగా రైతులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎఒ చిరంజీవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న ఎడిఎ రవీంద్రభారతి



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న శివాజీ

మత్స్యకార భరోసా వివరాలు అందించాలి

మాజీ మంత్రి శివాజీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మత్స్యకార భరోసా వివరాలు అందించాలని మాజీ మంత్రి గౌతు శివాజీ కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసంలో తహశీల్దార్ డి.సీతారామయ్యను సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019-2024 మధ్య మత్స్యకార భరోసా పక్కదారి పట్టిందన్నారు. నిజమైన మత్స్యకారులకు అన్యాయం జరిగిందన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించి చేపల వేట జీవనాధారంగా ఉన్న మత్స్యకారులకు అన్యాయం చేశారన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరగాలని కోరుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు, పుప్ప ఈశ్వరరావు, బి.శశిభూషణ్, దాసరి జె.ఇ.రావు, పోతనపల్లి సాంబమూర్తి, మరద దుర్యోధన, కె.ఆదినారాయణ, తమ్మినాన గోపాలరావు, రాపాక శాంతారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రనాయుడు

ఏజెంట్ల కమీషన్ తగ్గించడం దారుణం

ప్రజాశక్తి- పలాస

గత 68 ఏళ్లుగా ఎల్‌ఐసి ఏజెంట్లుగా పనిచేస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం కొత్త విధానం తీసుకువచ్చి ఏజెంట్ల కమీషన్ తగ్గించడం దారుణమని ఎల్‌ఐసి ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన రాజేంద్ర నాయుడు అన్నారు. పలాస ఎల్‌ఐసి కార్యాలయం ఆవరణలో సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ క్లా బ్యాక్ నూతన విధానాన్ని తీసుకురావడం ద్వారా ఏజెంట్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఏజెంట్ల సమస్యలపై గత 28 రోజులుగా ఎల్‌ఐఎఫ్‌ఐ ఆధ్వర్యాన పోరాటం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎల్‌ఐసి ఏజెంట్ల కమీషన్ విధానంలో తీసుకొచ్చిన విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, బి.వాసుదేవ్, వజ్జ ఈశ్వరరావు, వి.వసంతరావు, వై.వాసు, శ్రీనివాస్‌రాజు, తిరుపతిరావు, నర్సింహులు, బి.కొండలరావు, నక్క ప్రకాశరావు పాల్గొన్నారు.

నైపుణ్యాలతో ఉద్యోగావకాశాలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడి సమీపంలోని రాజీసీతాపూర్ వద్ద ఉన్న సెంచరి యూనివర్శిటీపై యాజమాన్య ప్రతినిధి ప్రధాన వక్త ప్రఫుల్ల కుమార్ పండా శ్రీకాకుళం పట్టణంలోని హోటల్ గ్రాండ్‌లో సోమవారం గాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము నైపుణ్యం కల్పించే పెద్ద పెద్ద కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంకా వివిధ ఉద్యోగాలు కల్పన, వివిధ వ్యాపారాలకు శిక్షణ ఇస్తామని తెలిపారు. తమ యూనివర్సిటీలో స్పోర్ట్స్, వ్యవసాయం, పశువైద్యం, ఫార్మసీ, నర్సింగ్, ఇంజినీరింగ్ తదితర కోర్సులు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డి.ఎన్.కామేశ్వరరావు, డి.ఆర్.వేణుగోపాల్‌రెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రకాంత్‌రెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ లింగరాజు, అడ్మిషన్ మేనేజర్ ఫాల్గుణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

క్రిటికల్ కేర్‌పై అవగాహన అవసరం

శ్రీకాకుళం అర్బన్: ప్రస్తుతం ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని క్రిటికల్ కేర్‌పై ప్రతిఒక్కరూ అవగహన పెంచుకోవాలని, అందులో మహిళలకు ఎదురవుతున్న ఆరోగ్య సమస్యల రీత్యా వారిలో చైతన్యం తీసుకురావాలని శశిధర్ ఆస్పత్రి వైద్యులు డాక్టరు అన్నెపు శశిధర్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో క్రిటికల్ కేర్‌పై అవగహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రోగ గ్రస్థులకు సకాలంలో వైద్యసేవలు అందించడానికి ఇది ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, ఐక్యూ కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ శంకరనారాయణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, జువాలజీ విభాగం హెఒడి ఐ.హేమ పద్మజ పాల్గొన్నారు.



విష్ణు చౌదరిని పరామర్శిస్తున్న శివాజీ

మాజీ మంత్రి పరామర్శ

పలాస: మండలంలోని వీరభద్రపురానికి చెందిన టిడిపి నాయకులు కొర్ల విష్ణు చౌదరి, వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణలపై ఇటీవల ప్రత్యార్థులు దాడి చేశారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శివాజీ కొర్ల విష్ణు చౌదరి స్వగృహానికి వెళ్లి సోమవారం పరామర్శించారు. పలాస ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న అంబటి రామకృష్ణను పరామర్శించి జరిగిన ఘటనాపై ఆరా తీశారు. కార్యకర్తలకు అండగా ఎమ్మెల్యే గౌతు శిరీష, టిడిపి ఉంటుందన్నారు. ఆయనతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూ రావు, పి.విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, మల్లా శ్రీనివాసరావు, కొరికాన శంకర్, డొక్కరి శంకర్, బి.నాగరాజు, లక్ష్మణ్‌కుమార్, కూర్మారావు ఉన్నారు.

డిసెంబరు 20 నుంచి సిపిఐ శత జయంత్యుత్సవాలు

పలాస: డిసెంబరు 20 నుంచి 26 వరకు అన్ని శాఖల్లో సిపిఐ శత జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ తెలిపారు. కాశీబుగ్గ సిపిఐ కార్యాలయంలో మండల సమితి సిహెచ్.రవి అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచాలన్న ఆలోచన విరమించుకొవాలని డిమాండ్ చేశారు. నిత్యవసర ధరలు ఆకాశానికి అంటుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు దారుణమన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేసి 14 రకాల నిత్యవసర వస్తువులు సరఫరా చేయాలన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చాపర సుందర్ లాల్, చాపర వేణుగోపాల్, ఎం.వెంకటరమణ, గోరు వాసు, సుందరరావు, మున్నా పవన్, తిరుపతిరావు పాల్గొన్నారు.

పశుగణనలో ప్రతిఒక్కరూ పాల్గొనాలి



పొందూరు : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పశుగణనలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద 21వ పశుగణన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 25 అక్టోబర్ 2024 నుంచి 28 ఫిబ్రవరి 2025 వరకు పశుగణన జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో మొత్తం కుటుంబాలకు సంబంధించిన పశువుల వివరాలను నమోదు చేయాల్సి ఉందన్నారు. గణనకు వచ్చిన సమయంలో పశువులు, కోళ్ల సంఖ్యపై సరైన సమాచారాన్ని వారికి అందించి సహకరించాలన్నారు. పాడి పంటలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇటీవల పశువులు పలు రోగాలతో మృతి చెందుతున్నాయని, అటువంటి సమయంలో పశుగణన చేసి వాటికి ఇన్స్యూరెన్స్ చెల్లించి తగిన ప్రతిఫలం పాడి రైతు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ రోణంకి ఆనందరావు, సుబ్రహ్మణ్యం, పశు వైద్యులు హేమలత, సతీష్ కుమార్, ఓంకార్, జ్యోత్స్న, వెంకటరావు, కరుణ, టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు తమ్మినేని విద్యాసాగర్ పాల్గొన్నారు.



ఆమదాలవలస : పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పొందూరు: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పశుగణన పోస్టర్‌ను ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక సహాయ సంచాలకులు డా.పి.ఎస్.జి.బాలకృష్ణ, మండల పశువైద్యాధికారులు డా.పద్మావతి, డా.శ్రీనివాసరావు, డా.దివ్య తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పోలాకి

నరసన్నపేట పట్టణంలో పెద్దపేటకు చెందిన పలువురు వైసిపి నాయకులు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సమక్షంలో సోమవారం టిడిపిలో చేరారు. స్థానిక కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో వారికి టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలోకి చేరిన వారిలో వైశ్యరాజు జయరాజ్, వైశ్యరాజు సాంబమూర్తిరాజు, కిల్లంశెట్టి వెంకట రమణమూర్తి ఉన్నారు. కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి జి.చిట్టిబాబు, కింజరాపు రామారావు, బోయిన సతీష్‌కుమార్, సరిపల్లి మధు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, పొట్నూరు నరసింహమూర్తి, దొడ్ల మల్లేశ్వరరావు, కేలం చిరంజీవి పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

పలువురు ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే సంస్థ లక్ష్యమని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు తామాడ లక్ష్మణరావు అన్నారు. ప్రమాదంలో గాయపడ్డ గౌడ సుశీలను పొల్లాడలోని ఆమె ఇంటి వద్ద సోమవారం కలిసి రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు మండల మహేష్, బత్సల విజయ్, గొండి రవి, దండుపాటి పవన్ కుమార్, బమ్మిడి నవీన్, కొంకి మోహిని, బొడ్డు రజిని, ఊర్వశి, బాలక సౌదామని తదితరులు పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని మామిడిపల్లికి చెందిన తెలుకుల ప్రశాంత్ ఇటీవల ఇంటి పైనుంచి జారిపడి తీవ్రంగా గాయాల పాలయ్యాడు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యం కోసం దాతల సహాయానికే ఎదురు చూస్తున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక సంతోషిమాత యువజన సేవా సంఘం సభ్యులు సోమవారం రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.



కాలిబాట వంతెన

కూలేందుకు సిద్ధంగా కాలిబాట వంతెన

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని వంశధార ఎడమ ప్రధాన కాలువపై ఉన్న 59 ఆర్ పిల్ల కాలువకు 1989లో ఐరన్ కాలిబాట వంతెన నిర్మించారు. అయితే అది ఏళ్లగా తుప్పు పట్టి పోవడంతో దానిపై నడిచేందుకు కూడా వీలు లేకపోవడంతో అటుగా వెళ్లాల్సిన రైతులు అవస్థలు తప్పడం లేదు. వంతెనపై నుంచి రాకపోకలు సాగించేందుకు భయం భయంగా వెళ్లాల్సి వస్తుందని రైతులు ఎం. శ్యామలరావు, ధర్మారావు, కె.విశ్వనాథంతో పాటు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే మరమ్మతులకు గురైన కాలిబాట వంతెన స్థానంలో వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

అలరించిన చిన్నారుల చెస్ పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులు విజయాల కోసం మరింత పోరాడి లక్ష్యాలు అందుకోవాలని శాంతినికేతన్ జూనియర్ కళాశాల డైరెక్టర్, విశ్రాంత జెడ్‌పి సిఇఒ సురంగి మోహనరావు అన్నారు. నగరంలోని స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీలో దీపావళి సందర్భంగా చిన్నారులతో ఉచిత ప్రవేశ చెస్‌పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని చిన్నారులు పాల్గొని ఐదు రౌండ్లు పాటు జరిగిన చెస్ పోటీల్లో ఆసక్తిగా పాల్గొన్నారు. విజేతలకు మోహనరావు బహుమతులను అందజేశారు. ఈపోటీల్లో ఫిడే ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ క్రీడాకారులు, స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ చెస్ కోచ్‌లు భేరి చిన్నారావు, కె.సాయి, నిరంజన్ సింగ్, సీనియర్ చెస్ క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా ఉరిటి లిఖిత్ శ్రీహర్ష 4, 5 విజయాలను సొంతం చేసుకున్నాడు. తరువాత స్థానాల్లో సీపాన యశ్వంత్, బలివాడ జయంత్, జివిఎస్‌వి చరణ్ తేజ్, మంగరాజు, శేషాద్రి పట్నాయిక్, ఎస్‌వి.రామ హర్షిత్, పేర్ల హర్షిత్, తురకాల తనయ్ తనిష్క్, జెకెఆర్ రోహిత్, గొర్లె హన్సిత్ నాయుడు, మొదలవలస జగదీష్, పి.కార్తికేయన్, దేవరశెట్టి సుహాస్, పదాల దిలీప్ కుమార్, పాతిన జ్యోతిప్రకాష్ ఇలుమూరు శ్రీసుహాస్, కోరాడ శ్రీహన్, పప్పల సందీప్, పాతిన హేమంత్, కడియం తనీష్ విజేతలుగా నిలిచారు. అండర్-10 బాలబాలికల పోటీల్లో గెల్లంకి అక్షయరాం, కె.పార్థవి, కల్లేపల్లి నీల్రాం మాన్విత్, గెల్లంకి ఆశ్రితరాం, ఐతివాడ మహన్వి, కె.రోహన్, బరాటం లలితే ఆదిత్య, చింతాడ సార్య, బరాటం పూర్ణిత, చింతాడ రోషన్, బి.మిషితా, కింజరాపు విజయ్ దర్శిత్ విజేతలుగా నిలిచారు.



ఆసక్తిగా సాగుతున్న చెస్ పోటీలు

స్టార్‌వాకర్స్‌కు అంతర్జాతీయ ఉత్తమ క్లబ్ అవార్డు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో గత పదిహేనేళ్లగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దినోత్సవాలు జరుపుతూ, నడక, నడత ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్తున్న స్టార్‌వాకర్స్ క్లబ్‌కు వరుసగా అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ క్లబ్ అవార్డు వచ్చింది. ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 క్యాబినెట్ అవార్డ్ ఫంక్షన్‌లో ఈ అవార్డు ప్రధానం చేశారు. ఉత్తమ క్లబ్‌గా స్టార్ వాకర్స్ క్లబ్, ఉత్తమ సేవా క్లబ్‌గా స్టార్ వనితా వాకర్స్ క్లబ్, ఉత్తమ క్లబ్ అధ్యక్షునిగా బి.వి. రవిశంకర్, ఉత్తమ డిప్యూటీ గవర్నర్‌గా శాసపు జోగినాయుడు, ఉత్తమ సామాజిక సేవకునిగా మాజీ గవర్నర్ జి.ఇందిరా ప్రసాద్, ఉత్తమ రీజనల్ కౌన్సిల్‌గా పీజీ గుప్తాలకు అవార్డులు లభించాయి. వీరితో పాటు మాజీ డిప్యూటీ గవర్నర్ సుగంధం సంజీవరావు, జి.లక్ష్మీ అవార్డులను అందుకున్నారు. సోమవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్‌వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు, జి.ఇందిరాప్రసాద్‌ల ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతలను అభినందించారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన అవార్డ్ ఫంక్షన్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ చైర్మన్ వి.మురళీ మోహన్, కాబోయే చైర్మన్ ప్రభావతి వాకర్స్, గవర్నర్ జామి నారాయణ స్వామి, వాకర్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు సుబ్బరాజు, ఎస్.ఎస్.ఎస్.ఎస్.రాజు, కృష్ణంరాజు, గున్నేశ్వరరావు, అభిమన్యు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డులతో వాకర్స్

డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి



ప్రారంభిస్తున్న కమిషనర్ రామారావు

ప్రజాశక్తి- పలాస

డ్వాక్రా మహిళలు తయారు చేసిన వస్తువులు అమ్మకాలు చేపట్టడం ద్వారా ఆర్థికాభివృద్ధి చెందుతారని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. కాశీబుగ్గ సంత మైదానంలో మున్సిపల్, మెప్మా ఆధ్వర్యాన స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులతో అర్బన్ మార్కెట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యులు స్వయంగా తయారు చేసిన వస్తువులను ప్రదర్శించి ప్రజలకు అందుబాటులో ఉంచడం, సంఘాలను మరింత బలోపేతం చేయడానికి ప్రయత్నించడం అభినందనీయమన్నారు. వస్తువులను ప్రజలకు చేరేటట్లు కృషి చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో వ్యాపారాలు జరిగేటట్లు చూడాలని కోరారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు సహకారంతో శాశ్వత ప్రాతిపదికన పట్టణంలో డ్వాక్రా బజార్‌ను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షులు టి.రాజ్యలక్ష్మి, కార్యదర్శి సునీతారాణి, ఉపాధ్యక్షులు జగదాంబ, మెప్మా అధికారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి పెరగాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

విద్యార్థులు దేశభక్తి, త్యాగనిరతి కలిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాకినాడ ఎపిఎస్‌పి మూడో బెటాలియన్‌కు చెందిన ఆర్ఎస్ఐ కె.శివకుమార్ అన్నారు. ఈ నెల 21 నుంచి 31వరకు జరుగుతున్న పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో అమరవీరుడైన రొక్కం శ్రీనివాసరావు సంస్మరణ సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించి 1994లో కాకినాడ ఎపిఎస్‌పి మూడో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి 1998 జూలై 4న ఒప్పంగి ప్రాంతంలో నక్సలైట్లు చేపట్టిన ఎదురు కాల్పుల్లో శ్రీనివాసరావు అమరుడైన విషయాన్ని గుర్తు చేశారు. అంతకుముందు శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డబ్బీరు గోవిందరావు, ఉపాధ్యాయుల స్టాఫ్ సెకరేటరీ ఎస్. తారకరామారావు, ఉపాధ్యాయులు సన్యాసమ్మ, వెంకటరావులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివకుమార్

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చేపేనపేటలో ఉన్న వ్యవసాయ క్షేత్రాలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సందర్శించారు. ఈ సందర్భంగా డిజిటల్ ఎల్ టు సురేష్ మాట్లాడుతూ కెవికె శాస్త్రవేత్తల బృందం చేపేనపేటలో రైతులు సాగు చేస్తున్న ఎ-గ్రేడ్ మోడల్ వరి పంటలను పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం నిమ్మతొర్లాడలోని నక్క చిరంజీవిరావు బెల్లం తయారీ యూనిట్‌ను సందర్శించారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలను సాగు చేస్తున్న రైతులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మీనాయుడు, యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని అర్జునవలసలో మొక్కజొన్న, వరిలో కాయ, కాండం తొలిచే పురుగు నివారణకు, లార్వా పురుగుల నివారణకు ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం అగ్ని అస్త్రం ద్రావణం తయారీపై అర్జునవలస మహిళా రైతులకు అవగాహన కల్పించారు. వరిలో కాండం తొలిసే పురుగు నివారణకు అర్జున వలస ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంలో అందుబాటులో ఉంచామని, అవసరమైన వారు గ్రామ కార్యకర్త కోట్ల సత్యవతిని సంప్రదించాలని యూనిట్ ఇన్‌ఛార్జి పెద్దింటి రాజేశ్వరి తెలిపారు. అలాగే కెల్ల రామలక్ష్మి 10 సెంట్లు విస్తీర్ణంలో ఎటిఎం మోడల్ వేయించారు. ఈ విధంగా వేసుకోవడం వలన ఒక కుటుంబానికి కావాల్సిన కూరగాయలను అందుబాటులో ఉంచవచ్చునన్నారు. కార్యక్రమంలో కలివరపు శివశంకర్, గంట్యాడ రాంబాబు, పట్నాన సత్యనారాయణ, జి.సూర్యకాంతం, కె.రామలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.



రణస్థలం : అగ్నిఅస్త్రం తయారు చేస్తున్న సిబ్బంది

కవిటి: రోజురోజుకీ వ్యవసాయ ఖర్చులు పెరిగిపోతున్న ప్రస్తుత రోజుల్లో రైతులు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించాలని తహశీల్దార్ మురళీమోహన్ అన్నారు. మీకోసంలో భాగంగా తహశీల్దార్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రత్యేక స్టాల్స్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ స్టాల్ లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులు ప్రదర్శించి తర్వాత విక్రయించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ ఇన్‌ఛార్జి తులసయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆకుకూరలు, కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. ఎటువంటి క్రిమిసంహారక మందులు వాడకుండా ప్రకృతి సిద్ధంగా పండించిన పంటలు పర్యావరణ సమతల్యానికి కూడా ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణమూర్తి, ఎపిఎం గోవిందరావు, విఆరఒ నారాయణ, ఐసిఆర్‌పి సంతోషి పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న రెడ్డి శాంతి

వంట గది ప్రారంభం

ప్రజాశక్తి- పాతపట్నం

స్థానిక నీలకంటేశ్వర ఆలయ వంట గదిని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ప్రారంభించారు. తన భర్త నాగభూషణరావు జ్ఞాపకార్థంగా రూ.4 లక్షలతో ఈ గదిని ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు సవిరిగాన ప్రదీప్, బి.నారాయణమూర్తి, ముర్రి గణపతిరావు, ఎం.తాతయ్య, నూలు ఈశ్వరరావు, గోకవలస రాము, పద్ద నేతాజీ, మంచి జోగారావుస్వామి, తూలుగు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

మహిళలపై దాడిని ఖండిస్తున్నాం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ పరిధిలోని తాళ్లభద్రపై టిడిపి నాయకుడు బాలిక, ఆమె తల్లిపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు అన్నారు. మండలంలోని బొడ్డపాడులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. జెస్సీ ఈవెంట్స్‌లో వచ్చిన కలతలు నేపథ్యంలో సుదీష్ణ, సందీప్‌లు పక్కకు తప్పుకొని వారు సొంతంగా కళా ప్రదర్శనలు ఇచ్చుకుంటూ పోతున్నారని అన్నారు. దానిని టిడిపి ఢిల్లీరావు జీర్ణించుకోలేక ఈ దాడికి పాల్పడ్డాడని ఆరోపించారు. కార్యక్రమంలో ఎఐసిసిటియు నాయకులు దున్న శ్రీనివాస్, కుత్తుం దుష్యంత్, పొతనపల్లి కామేశ్వరరావు, పోతనపల్లి అప్పారావు, కుత్తుం లోకనాథం, కైలాస్, జగదీష్ పాల్గొన్నారు.

గోశాలకు ఆవుల తరలింపు

టెక్కలి రూరల్: మేజర్ పంచాయతీ టెక్కల్లో రోడ్డుపై తిరుగుతున్న ఆవులను గోశాలకు తరలించామని, మూడు రోజుల్లో ఆవులు యజమానులు తీసుకెళ్లపోతే మందస గోశాలకు తరలిస్తామని పంచాయతీ ఇఒ కె.వి.వి.జగన్నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ తమ ఆవులను ఇంటివద్ద ఉన్న గోసాలల్లో కట్టుకోవాలని, ఆరుబయట, రోడ్డుపై కనిపిస్తే గోసాలకు తరలిస్తామని హెచ్చరించారు. గోశాలకు తరలించిన ఆవులను తమ ఆధార్ కార్డు పట్టుకొని వచ్చి అపరాధ రుసుం రూ.వెయ్యి కట్టుకుని తీసుకెళ్లాలని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- రణస్థలం

ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ రణస్థలం మండలశాఖ కార్యవర్గ సమావేశం సోమవారం రణస్థలం హైస్కూల్ వద్ద జరిగింది. ఈ సమావేశంలో నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా తొంపల సూరప్పుడు, ప్రధాన కార్యదర్శిగా సోమాదుల రమణ, గౌరవ అధ్యక్షులుగా సాకేటి పోతయ్య, ఉపాధ్యక్షుడుగా యామల గోపాల్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా లండ చిన్నబాబు, జాయింట్ సెక్రటరీగా బోనెల పరశురాం, కోశాధికారిగా నేతల పెంటయ్య ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో దళిత మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు దత్తి గోవింద, దుంగ సూర్యనారాయణ, సీనియర్ నాయకులు పల్ల నీలయ్య, కుప్పిలి పైడిరాజు, దుక్క ఆదినారాయణ, నడుపూరి ఆనంద్, లింగాల రమణ, లావేరు మండల సభ్యులు రవి, గంట్లాన ఇషాక్, రాము పాల్గొన్నారు.



కొబ్బరి మొక్కను నాటుతున్న లాస్యశ్రీ

మొక్కలు నాటాలి

కొత్తూరు: ప్రతిఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణ రక్షణకు కృషి చేయాలని హిరమండలం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోగుల మాధవీప్రసాద్ నాయుడు అన్నారు. ఆమె కుమార్తె లాస్యశ్రీ జన్మదినం సందర్భంగా స్థానిక మహర్షి విద్యాలయంలో సోమవారం కొబ్బరి మొక్కను నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముగితి రాంబాబు, ఉపాధ్యాయులు లోతుగెడ్డ కన్నబాబు, లోతుగెడ్డ రామారావు, పిన్నింటి రామారావు నాయుడు, జడ్డు రామకృష్ణ పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న ఎంపిడిఒ లక్ష్మీబాయి

అభివృద్ధి పనులు వేగవంతం

టెక్కలి రూరల్ : మండలంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న సిసి రోడ్లు, కాలువలు పనులపై నివేదిక అందజేయాలన్నారు. ఎనర్జీ ఎస్, 15 ఫైనాన్స్ నిధులు పూర్తిగా సద్వినియోగమయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఇ ఎస్.వి.నాయుడు, ఎపిఒ బగాది ప్రసాదరావు పాల్గొన్నారు.

'రిమ్స్' వైద్యులపై ఫిర్యాదు

ఆమదాలవలస: జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రి వైద్యులపై జెడ్‌పిలో సోమవారం నిర్వహించిన మీకోసంలో ఫిర్యాదు చేసినట్లు కనుగులవలస సర్పంచ్ నూక అప్పల సూరన్నాయుడు (రాజు) తెలిపారు. గతంలో ఎటువంటి అంగవైకల్యం లేని వ్యక్తులకు తప్పుడు దివ్యాంగ ధ్రువపత్రాలు మంజూరు చేశారని, నకిలీ వికలాంగుల ధ్రువపత్రాలతో పింఛన్లు పొంది ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఇటీవల ఫిర్యాదు చేశానన్నారు. తన ఫిర్యాదుపై నకిలీ ధ్రుపత్రాలను పున్ణపరిశీలనకు రిమ్స్ వైద్యులకు పంపించగా, అంగవైకల్యం లేని వ్యక్తులకు ఇచ్చిన 40 శాతం ధ్రువపత్రాలను వంద శాతంగా ఇచ్చి రిమ్స్ వైద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ పింఛన్లతో పాటు తప్పుడు ధ్రువపత్రాల మంజూరు చేసిన రిమ్స్ వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. అప్పటికి న్యాయం జరగకపోతే రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు తెలిపారు.